ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

చెరువులను తలపిస్తున్న చేలు

పోలవరం రూరల్: ఎడతెరిపివ్వని వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని కొవ్వాడ, ఇసుక కాలువ, పేడ్రాల కాలువలు పొంగి ప్రవహించడంతో నాలుగు రోజులుగా నాట్లు వేసిన పొలాలు, వరినాట్లు, ముంపులోనే నానుతున్నాయి. కొండవాగుల నీరు దిగువకు చేరే పరిస్థితి లేదు. మరో వైపు గోదావరి వరద పెరుగుతుండటంతో కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరి వరద నీరు ఎగదన్ని పొలాల్లోకి చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి 200 క్యూసెక్కుల నీరు కొవ్వాడ కాలువ నుంచి పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరి నదిలోకి చేరుతోంది. పోలవరం గ్రామంలో పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని ఇంజిన్లు ఏర్పాటు చేసి తోడే కార్యక్రమం పంచాయతీ చేపట్టింది.

అప్రమత్తంగా ఉండాలి

వరదలు, వర్షాల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరదల మండల ప్రత్యేక అధికారి ఎం.రాజు ఆదేశించారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయన మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నెక్లెస్‌బండ్ గట్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. గ్రామంలో వర్షపు నీరు నిల్వ లేకుండా కచ్చా డ్రెయిన్లు ఏర్పాటుచేయాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలవరంలో వర్షం నీటిని మళ్లించే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఎంపీడీఓ జి.శ్రీను, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన రాకపోకలు

కొయ్యలగూడెం: భారీ వర్షాలకు ప్పొంగిన ఎర్రకాలవ వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల మధ్య మంగపతిదేవిపాలెం వద్ద ఎర్రకాలువ ఉధృతికి రాకపోకలు స్తంభించాయి. పంట పొలాలు నీట మునిగాయి. సుమారు 10 గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారు. కన్నాపురం, తూర్పు పడమటి కాలువలు ఉధృతి తగ్గడంతో బుట్టాయిగూడెం, పోలవరం, కొయ్యలగూడెం మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వేదాంతపురం సమీపంలోని బైనేరు వాగు కల్వర్టు ముంపునకు గురవడంతో వ్యవసాయ పనులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొయ్యలగూడెం మండలంలో సుమారు 300 ఎకరాల్లో వరిచేలు ముంపులోనే ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి చెన్నకేశవులు తెలిపారు. వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయని, వరద వల్ల కొట్టుకొచ్చిన బురదతో ఇప్పటి వరకు వేసిన నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయని గంగవరం గ్రామానికి చెందిన రైతు బల్లె కేసు బాబు వాపోయాడు. తిరిగి వరి ఊడుపులు నిర్వహించుకోవడానికి ఆర్థిక భారం వహించాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

రహదారిపై పడిన చెట్లకొమ్మలు

బుట్టాయగూడెం: భారీ వర్షాలకు బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారిలో మర్లగూడెం అటవీప్రాంతంలో నాలుగు రోజులుగా చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ నుంచి వాహనాలు వెళ్తున్నాయి. వర్షానికి రోడ్డు మార్జిన్ కూడా పాడైపోయింది. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నిర్వాసితులకు పరామర్శ

వేలేరుపాడు: సీపీఐఎంఎల్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ బృందం సోమవారం నాలుగో రోజు అల్లూరి నగర్ గ్రామంలో పెదవాగు వరద నిర్వాసితులను పరామర్శించింది. కమ్మరగూడెం, మేడేపల్లి, అల్లూరి నగర్, కోయ మాధవరం, విప్పలగుంపు, రామవరం, ఊటగుంపు, రెడ్డిగూడెం, గొల్లగూడెం, సొందేవారిగొల్లగూడెం, పాత పూచిరాల, వసంతవాడ, మద్ది గట్ల తదితర 12 గ్రామాల్లో బృందం పర్యటించింది. ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ ఇళ్లు కొట్టుకుపోయిన, పడిపోయిన ప్రతి ఇంటికి టార్పాలిన్లు ఇవ్వాలని, గ్రామాల్లో శానిటేషన్ రెగ్యులర్‌గా చేయాలని, దోమల నివారణ మందు కొట్టించాలని, ఫాగింగ్ చేయాలని, హెల్త్ క్యాంపు కొనసాగించాలని, ఇంటింటికీ దోమతెరలు ఇవ్వాలని, ప్రతి రోజు భోజనం, మంచి నీరు, సరఫరా చేయాలని, తక్షణ ఆర్థిక సాయం కుటుంబానికి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తమ్మిలేరుకు కొనసాగుతున్న వరద

చింతలపూడి: ఖమ్మం జిల్లా బేతుపల్లి నుంచి తమ్మిలేరు రిజర్వాయర్‌కు సోమవారం కూడా స్వల్పంగా వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టువద్దే మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.91 అడుగులకు చేరింది. గోనెలవాగు స్టోరేజ్ ట్యాంక్ నీటిమట్టం 347.68 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.798 టీఎంసీలకు చేరుకుందన్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగు పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 1,481 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాలువ ద్వారా ప్రాజెక్టులోకి వస్తోందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు.


పోలవరం రూరల్: నిండుకుండలా ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లో ప్రవాహం


పోలవరం రూరల్: పోలవరం ప్రాంతంలో ముంపులోనే ఉన్న పొలాలు


కొయ్యలగూడెం : మంగపతిదేవిపాలెం సమీపంలో ఉధృతిగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ


బుట్టాయగూడెం : మర్లగూడెం అటవీప్రాంత సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నచెట్టుకొమ్మ


చింతలపూడి : నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు జలాశయం నుంచి లీకువుతున్న నీరు

క్లుప్తంగా

వైభవంగా శ్రవణ నక్షత్ర కల్యాణోత్సవం


శ్రీనివాసునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ఆషాడమాస శ్రవణా నక్షత్ర సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏలూరుకు చెందిన జనార్ధన వికాస తరంగిణి భక్త బృందంచే నాలాయిర దివ్య ప్రబంధం నాలుగురోజుల సేవా కాలాన్ని ఆలయ కల్యాణ మండపంలో ప్రారంభించారు. కల్యాణోత్సవాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత వైద్యశిబిరం


కాలేజీలో ఆరోగ్య పరీక్ష చేస్తున్న వైద్యుడు

జంగారెడ్డిగూడెం: మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థాని బీసీ మహిళ కాలేజ్ హాస్టల్ విద్యార్థినులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ చదువు సక్రమంగా సాగేందుకు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థినులకు సూచించారు. డాక్టర్ పీడీ సల్మాన్‌ఖాన్ మాట్లాడుతూ ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినిలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వార్డెన్ బి.శిరీష, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన కృషితో విజయం


అభ్యర్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: డీఎస్సీకి సిద్ధమవుతున్న 30 మంది అభ్యర్థులకు కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ కష్టపడటంతో పాటు ఇష్టపడి చదువును కొనసాగిస్తూ, స్మార్ట్‌గా చదివిన వారే విజయం సాధిస్తారని అన్నారు. సంఘ జిల్లా నాయకులు జరభల కృష్ణ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. భూక్యా బిగనాథం, భూక్యా శ్రీనివాస్, ధరావత్ రవి, చంటి నాయక్, ధరావత్ బంగారయ్య, హసావత్ రవింద్ర, తేజావత్ రామకృష్ణ, భూక్యా రామకృష్ణ, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


వల్లంపట్లలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

టి.నరసాపురం: వల్లంపట్ల, మల్లుకుంట తదితర గ్రామాల్లో సోమవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మూరు శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని పొడిగించినట్టు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గత మార్చి 31వ తేదీన ముగిసిన ఈ గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఏడాది కాలానికి ప్రభుత్వం పొడిగించినట్టు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కొనసాగుతున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌కు ఇది సమాంతరంగా కొనసాగుతుందని తెలిపారు.

10వ తరగతి మాధ్యమంపై స్పష్టత ఇవ్వాలి

ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు అందరూ ఇంగ్లిష్ మాధ్యమంలోనే పబ్లిక్ పరీక్షలు రాయాలన్న గత ప్రభుత్వ నిబంధనను సడలించి, మాధ్యమం ఎంపికను విద్యార్థుల ఇష్టానికి వదిలివేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాధ్యమాలు ప్రవేశపెట్టడంతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మీసేవ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మీసేవ వెబ్‌సైట్ ఆన్‌లైన్ సేవలను ప్రభుత్వం తక్షణమే కొనసాగించాలని డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు మీసేవ సెంటర్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేక అడ్మిషన్ అయ్యేందుకు వీలుపడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల అన్ని రకాల సేవలు గల ఆన్‌లైన్ వెబ్‌సైట్ తక్షణమే కొనసాగింపు చేయాలని డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


టి.నరసాపురం : నీట మునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ సుమలత

టి.నరసాపురం: నీట మునిగిన పంటలను యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రక్షించుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుమలత అన్నారు. మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను ఆమె సోమవారం పరిశీలించారు. మండలంలోని 55 ఎకరాల వరి, 7 ఎకరాల మొక్కజొన్న నీటిలో మునిగాయని చెప్పారు. నారుమడి దశలో ఉంటే 5 సెంట్లు నారుమడికి 1 కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలని రైతులకు సూచించారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని తొలగించి, పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా వేయాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేస్తే పైరు త్వరగా పుంజుకుంటుందని వివరించారు. తెగుళ్లు సోకకుండా కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సుమలత రైతులకు సూచించారు.

చెత్తను తొలగించారు.. నీటిని మళ్లించారు



ద్వారకాతిరుమలలోని బైపాస్ రోడ్డు చెత్త కారణంగా నిలిచిన వర్షపు నీరు చెత్తను తొలగిస్తున్న జేసీబీ

ద్వారకాతిరుమల: స్థానిక పోలీస్ క్వార్టర్స్ మీదుగా వెళ్లే బైపాస్ రోడ్డు డంపింగ్ యార్డుగా మారింది. పారిశుధ్య కార్మికులు గ్రామంలోని చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డు సమీపంలోని రహదారిపై వేస్తున్నారు. దీంతో ప్రస్తుత వర్షాలకు ఆ ప్రాంతం నీట మునిగింది. నీరు పక్కనున్న చెరువులోకి పారే వీలులేకుండా చెత్త అడ్డు పడటంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. అటుగా ప్రయాణించే వీలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి దారుణంగా మారడంతో పంచాయతీ అధికారులు చెత్తను తొలగించి, నీటిని మళ్లించేందుకు సోమవారం చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మొగతడకల ఓం ప్రకాష్ తన సొంత ఖర్చులతో చెత్తను జేసీబీ సాయంతో తొలగింపజేసి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. దాంతో వాహనచోదకులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల సీజ్


వాహనాన్ని సీజ్ చేస్తున్న నిడమర్రు పోలీసులు

నిడమర్రు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను సోమవారం నిడమర్రు, పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తోకలపల్లి పరిధిలోని గ్రామాలకు కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్లు నిడమర్రు ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. తోకలపల్లి గ్రామానికి చెందిన సైదు చిట్టిబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల ధ్వంసం

పెదపాడు: మండలంలోని తోటగూడెం మీదుగా నాయుడుగూడెం వైపునకు కోళ్ల వ్యర్థాలతో వాహనాన్ని పోలీసులు తోటగూడెం సమీపంలో స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేసినట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ఉచిత కరెంట్ ఇవ్వాలని ధర్నా చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లను ఉచితంగా ఇచ్చేవారని, ఇందుకు జీఓ కూడా విడుదల చేసిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు ఎస్సీ, ఎస్టీలను పాత బకాయిల పేరుతో బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 200 యూనిట్లను 300కు పెంచి ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పాత బకాయిల పేరుతో ఎస్సీ, ఎస్టీలను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఝాన్సీ, పి.రాధ, సీత, పుష్ప, వెంకటేశ్వరరావు, దుర్గారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కామవరపుకోట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, రోడ్డు నిబంధనలను పాటించాలని తడికలపూడి ఎస్సై జయబాబు అన్నారు. సోమవారం తడికలపూడి గాంధీబొమ్మ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించలేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సరైన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లేని ప్రయాణం చాలా ప్రమాదకరమని ఎస్సై హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఎదుటి వారిని ప్రమాదానికి గురి చేయొద్దన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పు ఆయన హెచ్చరించారు.

పంట రుణాలపై అవగాహన

పోలవరం రూరల్: పోలవరంలోని రైతు సేవా కేంద్రంలో సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతులకు పంట రుణాలపై అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబులు మాట్లాడుతూ ఒక సర్వే నెంబర్‌పై ఒకరికి మాత్రమే రుణం మంజూరు చేస్తామన్నారు. రైతుల పిల్లలు చదువుకునేందుకు ఎడ్యుకేషన్ లోన్ మంజూరు చేస్తామని చెప్పారు.

ఆదివాసీ దినోత్సవ కరపత్రం విడుదల


కుక్కునూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నవోత్సవాల కరపత్రం విడుదల చేశారు. రెడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్‌పీ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు మాట్లాడారు. ఆగష్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆదివాసీ నవోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వరదల్లో ముంపుకు గురవుతున్న ఆదివాసీ ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని, నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ మండల అధ్యక్షుడు సరియం ప్రసాద్, కార్యదర్శి పైదా పరమేష్, బొర్రయ్య, చిన్నబాబు, వేణుగోపాల్, ప్రచార కార్యదర్శి పెనుబట్టి నాగరాజు, సత్యనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నాటు పుట్టగొడుగులకు యమ డిమాండ్


అటవీ ప్రాంతంలో పెరుగుతున్న పుట్టగొడుగులు

బుట్టాయగూడెం: పుట్టగొడుగుల కాలం రానేవచ్చింది. గిరిజన ప్రాంతంలో వర్షాలు కురవగానే అటవీప్రాంతంలో ఉన్న పుట్టల్లో నాటు పుట్టగొడుగులు అత్యధికంగా లభిస్తుంటాయి. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పుట్టలపై పుట్టగొడుగులు కనిపిస్తున్నాయి. దీనితో అటవీప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజనులు నాటు పుట్టగొడుగులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. 25 నుంచి 30 పుట్టగొడుగులను ఒక కట్టగా కట్టి సుమారు రూ.100కు గిరిజనులు విక్రయిస్తున్నారు. అడవిలో లభించే నాటు పుట్టగొడుగులకు అధిక డిమాండ్ ఉండడంతో అడవి నుంచి తీసుకువచ్చి వెంటనే అమ్ముడుపోతున్నాయి. అయితే పుట్టగొడుగుల సేకరణ అంత సులభమైన పనికాదు. తెల్లవారుజామునే అటవీప్రాంతానికి వెళ్లి పుట్టలపై ఉన్న పుట్టగొడుగులను సేకరించాలి. ఒక్కోసారి ఆ పుట్టల్లో పాములు కూడా ఉంటాయి. అలాగే చీమలు కూడా కుడతాయి. పుట్టగొడుగులకు వెళ్లిన గిరిజనులు విషపురుగుల బారిన పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. అయితే ప్రతిఏటా వర్షాకాల సీజన్‌లో ఈ ప్రాంతానికి వచ్చి పుట్టగొడుగులను తీసుకువెళ్లినవారు ఉన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలకు పుట్టగొడుగులు లభించడంతో వాటి కోసం అనేక మంది ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. కొంతమంది వీటిని గిరిజన ప్రాంతంలో రూ.100కు కొనుగోలు చేసి బయట ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ. 400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగులు ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఎంతో ఆరోగ్యవంతమైనవని గిరిజనులు చెప్తున్నారు.

డ్రైవర్లకు పదోన్నతి వేతనం ఇవ్వాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్‌లోని 8 మందికి, ఇంజిన్ సెక్షన్ మజ్దూర్ ఒకరికి మొత్తం 9 మందికి 2022 మార్చి 30న హెవీ వెహికల్స్ డ్రైవర్స్‌గా పదోన్నతి కల్పించినా నేటికీ వారికి పదోన్నతి వేతనం, ఇంక్రిమెంట్లు, హాడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆరోపించారు. తక్షణమే వారికి పెరిగిన వేతనాలు, ఇంక్రిమెంట్లు కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. పదోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్, ఇంజినీరింగ్ సెక్షన్ డీఈ తాతబ్బాయి నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి సంక్రాంతి బోనస్ ప్రకటించిందని, ఏలూరు కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి బోనస్ చెల్లించారని, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, నాయకులు బి.నాగేశ్వరరావు, ఎస్ శ్రీనివాస్, ఎస్ఎంవీ సుబ్బారావు, డ్రైవర్లు మెరుగు గోవిందు, గోరాకుల దుర్గారావు, గాడి అప్పారావు, అంతర్వేది శేఖర్, కునుగుపాటి ప్రసాద్, తాడేపల్లి శేఖర్, ఏబీ ఆంథోని పాల్, ధనికొండ అప్పారావు, పంతం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.